రాయల్స్ షో

ముంబైపై రాజస్థాన్ ఘన విజయం

సందీప్‌శర్మకు ఐదు వికెట్లు

జైస్వాల్ సూపర్ సెంచరీ

జైపూర్: ఐపీఎల్-17లో వరుస విజయాలతో దూకుడుమీదున్న రాజస్థాన్ రాయల్స్ సొంత ఇలాఖాలో ముంబై ఇండియన్స్‌ను చిత్తుచేసి ప్లేఆఫ్స్ బెర్తును దాదాపు ఖాయం చేసుకుంది. జైపూర్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో ముంబైని 9 వికెట్ల తేడాతో చిత్తుచేసింది.సందీప్ శర్మ (5/18) ఐదు వికెట్ల ప్రదర్శనకు తోడు బౌల్ట్ (2/32) బౌలింగ్ మెరుపుల ధాటికి మొదట బ్యాటింగ్ చేసిన ముంబై.. 20 ఓవర్లలో 179 పరుగులకే పరిమితమైంది. తిలక్ వర్మ (45 బంతుల్లో 65, 5 ఫోర్లు, 3 సిక్సర్లు), నెహల్ వధెర (24 బంతుల్లో 49, 3 ఫోర్లు, 4 సిక్సర్లు) రాణించారు. అనంతరం ఛేదనలో రాజస్థాన్ ఓపెనర్ యశస్వీ జైస్వాల్ (60 బంతుల్లో 104 నాటౌట్, 9 ఫోర్లు, 7 సిక్సర్లు) సెంచరీతో కదం తొక్కడంతో 18.4 ఓవర్లలోనే ఒక్క వికెట్ మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని పూర్తిచేసింది. సందీప్‌కు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది.

సందీప్ పాంచ్ పటాకా:

టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన ముంబై బౌల్ట్, సందీప్ పేస్‌కు బెంబేలెత్తిపోయింది. టాపార్డర్‌లో ఇషాన్ డకౌట్ అవగా రోహిత్ (6), సూర్య(10) విఫలమయ్యారు. నాలుగో స్థానంలో వచ్చిన తిలక్ వర్మ.. నబీ (23)తో కలిసి ముంబై ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. 4వ వికెట్‌కు ఈ జోడీ 32 పరుగులు జోడించింది. నబీని ఔట్ చేయడం ద్వారా రాజస్థాన్ స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్ ఐపీఎల్‌లో 200వ వికెట్ తీసిన తొలి బౌలర్‌గా రికార్డులకెక్కాడు. నబీ నిష్క్రమించినా వధెర రాకతో ముంబై స్కోరుబోర్డు పరుగులు పెట్టింది. తిలక్-వధెర రాజస్థాన్ స్పిన్నర్లపై ఎదురుదాడికి దిగి ఐదో వికెట్‌కు 99 పరుగులు జోడించడంతో ఆ జట్టు గౌరవప్రదమైన స్కోరు సాధించింది.

జైస్వాల్ అదుర్స్:

ఛేదనలో రాయల్స్‌కు అదిరిపోయే ఆరంభం దక్కింది. జైస్వాల్, బట్లర్ (35) తొలి వికెట్‌కు 7.6 ఓవర్లలోనే 74 పరుగులు జోడించారు. ఈ సీజన్‌లో వరుసగా విఫలమవుతున్న జైస్వాల్ ఈ మ్యాచ్‌లో ముంబై బౌలర్లను ఆటాడుకున్నాడు. వర్షం అంతరాయం తర్వాత బట్లర్ ఔట్ అయినా సంజూ శాంసన్ (38 నాటౌట్) తో కలిసి రాజస్థాన్‌ను లక్ష్యం దిశగా నడిపించాడు. 30 బంతుల్లోనే 50 రన్స్ పూర్తిచేసిన అతడు.. అర్ధ శతకం తర్వాత మరింత దూకుడుగా ఆడి 59 బంతుల్లోనే ఐపీఎల్ కెరీర్‌లో రెండో శతకం పూర్తిచేశాడు. జైస్వాల్ బాదుడుకు తోడు ముంబై ఫీల్డర్ల చెత్త ఫీల్డింగ్ రాజస్థాన్ బ్యాటర్లకు కలిసొచ్చాయి.

సంక్షిప్త స్కోర్లు

ముంబై : 20 ఓవర్లలో 179/9 (తిలక్ 65, వధెర 49, సందీప్ 5/18, బౌల్ట్ 2/32). **రాజస్థాన్ :** 18.4 ఓవర్లలో 183/1 (జైస్వాల్ 104 నాటౌట్, సంజూ , చావ్లా 1/33)

పాయింట్ల పట్టిక

జ	ఆ	గె	ఓ	ర	పా
రాజస్థాన్	8	7	1	0.69	14
కోల్‌కతా	7	5	2	1.20	10
హైదరాబాద్	7	5	2	0.91	10
చెన్నై	7	4	3	0.52	8
లక్నో	7	4	3	0.12	8
గుజరాత్	8	4	4	-1.05	8
ముంబై	8	3	5	-0.22	6
ఢిల్లీ	8	3	5	-0.47	6
పంజాబ్	8	2	6	-0.29	4
బెంగళూరు	9	1	7	-1.04	2

నోట్: జ:జట్లు, ఆ: ఆడినవి, గె: గెలిచినవి, ఓ: ఓడినవి, ర:రన్‌రేట్, పా:పాయింట్లు

క్యాండిడేట్స్ చెస్ టోర్నీ 2024 టైటిల్ కైవసం

రారాజు గుకేశ్

అత్యంత పిన్న వయస్కుడిగా రికార్డు • ప్రపంచ చాంపియన్‌షిప్ టైటిల్‌కు అర్హత

64 గళ్ల ఆటలో కొత్త రారాజు వచ్చాడు. సుమారు రెండున్నర దశాబ్దాలుగా భారత చదరంగ క్రీడకు కర్త, కర్మ, క్రియగా ఉన్న దిగ్గజ గ్రాండ్‌మాస్టర్ విశ్వనాథన్ ఆనంద్ వారసుడిగా తెలుగు మూలాలున్న 17 ఏండ్ల చెన్నై చిన్నోడు దొమ్మరాజు గుకేశ్ సంచలన ప్రదర్శనతో సరికొత్త చరిత్ర సృష్టించాడు. తనదైన ఎత్తులతో ప్రత్యర్థులను చిత్తు చేస్తూ.. చెస్ బోర్డుపై పరిస్థితులకు తగ్గట్టుగా వ్యూహాలను మార్చుకుంటూ.. కెనడాలోని టొరంటో వేదికగా ముగిసిన 'క్యాండిడేట్స్ చెస్ టోర్నీ-2024' టైటిల్ విజేతగా నిలిచి అత్యంత పిన్న వయసులో ఈ ఘనత సాధించిన తొలి ఆటగాడిగా నవచరిత్ర లిఖించాడు. 14వ రౌండ్‌లో హికారు నకమురాతో గేమ్‌ను డ్రా చేసుకోవడంతో 9 పాయింట్లు సాధించిన గుకేశ్.. అగ్ర స్థానంలో నిలిచి ఆనంద్ తర్వాత ఈ టోర్నీలో విజేతగా నిలిచిన రెండో భారతీయుడిగా రికార్డులకెక్కాడు. 2014లో ఆనంద్ ఈ టోర్నీ విజేతగా నిలవగా పదేండ్ల తర్వాత అతడే మెంటార్‌గా ఉన్న గుకేశ్.. టైటిల్ నెగ్గడం గమనార్హం.

విజేత ప్రైజ్‌మనీ
రూ.78.50 లక్షలు

టొరంటో : భారత యువ గ్రాండ్‌మాస్టర్ దొమ్మరాజు గుకేశ్ సంచలన ప్రదర్శనతో ప్రతిష్టాత్మక 'క్యాండిడేట్స్ చెస్ టోర్నీ 2024' టైటిల్‌ను సొంతం చేసుకున్నాడు. టైటిల్ విజేతను నిర్ణయించే 14వ రౌండ్‌లో హికారు నకమురా (అమెరికా)తో గేమ్‌ను డ్రా చేసుకున్న అతడు 9 పాయింట్లతో ఒంటరిగా అగ్రస్థానానికి చేరి 17 ఏండ్ల వయసులోనే ఈ టోర్నీ నెగ్గిన తొలి ఆటగాడిగా చరిత్ర సృష్టించాడు. టోర్నీ ఆద్యంతం అంచనాలకు మించి రాణించిన గుకేశ్.. తుది రౌండ్‌లో నల్లపావులతో బరిలోకి దిగాడు. 71 ఎత్తులలో ముగిసిన ఈ గేమ్ తర్వాత టోర్నీ విజేతను నిర్ణయించే క్రమంలో కొంత నాటకీయత చోటుచేసుకుంది. 14వ రౌండ్‌లో ఫాబియానో కరువానా (అమెరికా) - ఇయాన్ నెపొనియాచి (రష్యా) ల మధ్య జరిగిన పోరులో ఎవరు గెలిచినా వారి పాయింట్లూ గుకేశ్‌తో సమానంగా (9) ఉండేవి. అప్పుడు విజేతను సంయుక్తంగా ప్రకటించాల్సి వచ్చేది. కానీ 41వ ఎత్తులో కరువానా తప్పిదం నెపొనియాచికి కలిసొచ్చి అతడు గేమ్‌ను డ్రా చేసుకున్నాడు. దీంతో నెపొనియాచి, కరువానా, నకమురా 8.5 పాయింట్ల వద్దే ఆగిపోయి సంయుక్తంగా రెండో స్థానంలో నిలిచారు. 8 మంది ఆటగాళ్లు 'డబుల్ రౌండ్ రాబిన్ ఫార్మాట్'లో తలపడ్డ ఈ టోర్నీలో గుకేశ్.. ఏడో రౌండ్‌లో మాత్రమే ఓడిపోయాడు. కానీ ఆ రౌండ్‌లో ఓటమే తనలో కసి పెంచిందని విజేతగా నిలిచిన తర్వాత అతడు వెల్లడించాడు.

ప్రపంచ చాంపియన్‌తో 'ఢీ'

ఈ విజయంతో గుకేశ్.. ప్రపంచ చాంపియన్‌షిప్‌లో అతడు చైనాకు చెందిన డింగ్ లిరెన్‌తో తలపడాల్సి ఉంది. ఇందుకు సంబంధించిన షెడ్యూల్ ఇంకా విడుదల కానప్పటికీ ఇక్కడా గెలిస్తే ప్రపంచ చాంపియన్‌గా నిలిచే అతి పిన్న వయస్కుడిగా అతడు రికార్డులకెక్కుతాడు.

దేశం కోసం ఆడటం ప్రత్యేకం

'గత కొన్ని రోజులుగా చాలా ఒత్తిడికి లోనయ్యా. కానీ నా ఆఖరి గేమ్ పూర్తికాకముందే చాలా ప్రశాంతంగా ఉంది. నేను గేమ్ ఆడుతున్నా నా దృష్టి అంతా ఆ గేమ్ (కరువానా-నెపొనియాచి) మీదే ఉంది. దేశం కోసం ఆడుతూ ఏదైనా సాధించడం చాలా చాలా ప్రత్యేకం. నా విజయానికి మద్దతుగా నిలిచినవారందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు. ఏడో రౌండ్‌లో ఓటమి తర్వాత విజయం నాలో కొత్త స్ఫూర్తిని నింపింది. ఓటమితో కాస్త నిరాశకు గురైనా తర్వాత మాత్రం పట్టుదలతో ఆడా. ప్రపంచ చాంపియన్‌షిప్ మ్యాచ్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నా'. **- గుకేశ్**

గుకేశ్ 'రాజు' అయ్యాడిలా..

1వ రౌండ్	విదిత్ గుజరాతితో	డ్రా
2వ రౌండ్	ప్రజ్ఞానందతో	గెలుపు
3వ రౌండ్	నెపొనియాచితో	డ్రా
4వ రౌండ్	కరువానాతో	డ్రా
5వ రౌండ్	నిజత్ అబసోవ్‌పై	గెలుపు
6వ రౌండ్	నకమురతో	డ్రా
7వ రౌండ్	అలిరెజా ఫిరూజాతో	ఓటమి
8వ రౌండ్	విదిత్ పై	గెలుపు
9వ రౌండ్	ప్రజ్ఞానందతో	డ్రా
10వ రౌండ్	నెపొనియాచితో	డ్రా
11వ రౌండ్	కరువానాతో	డ్రా
12వ రౌండ్	నిజత్‌తో	గెలుపు
13వ రౌండ్	అలిరెజాపై	గెలుపు
14వ రౌండ్	నకమురతో	డ్రా

రెండో స్థానంలో హంపి

ఈ టోర్నీలో భాగంగా మహిళల విభాగంలో ఆంధ్రప్రదేశ్ చెస్ దిగ్గజం కోనేరు హంపి రెండో స్థానంలో నిలిచింది. 14వ రౌండ్‌లో ఆమె.. చైనా అమ్మాయి లి టింగ్జిని ఓడించింది. చైనాకే చెందిన టాన్ ఝోంగి 9 పాయింట్లతో విజేతగా నిలిచింది. హంపితో పాటు టింగ్జి, వైశాలి 7.5 పాయింట్లతో సంయుక్తంగా రెండో స్థానంలో నిలిచారు.

కోహ్లీ, కరన్‌కు జరిమానా

ముంబై : ఐపీఎల్‌లో కెప్టెన్లు స్లో ఓవర్ రేట్‌లకు బలవుతుంటే మితిమీరి నియమావళిని ఉల్లంఘిస్తున్న ఆటగాళ్లపై ఐపీఎల్ పాలకమండలి 'ఫైన్' కొరడాలను ఝుళిపిస్తోంది. కోల్‌కతాతో మ్యాచ్‌లో హర్షిత్ రాణా బౌలింగ్‌లో వివాదాస్పద నిర్ణయంతో ఔట్ అయిన ఆర్సీబీ స్టార్ బ్యాటర్ కోహ్లీ.. ఫీల్డ్ అంపైర్‌తో వాగ్వాదానికి దిగాడు. దీంతో అతడు ఐపీఎల్ నియమావళి ఆర్టికల్ 2.8ని ఉల్లంఘించినందుకు గాను కోహ్లీ మ్యాచ్ ఫీజులో 50 శాతం కోత పడింది. పంజాబ్ కెప్టెన్ కరన్ పైనా 50 శాతం కోత విధించారు.

సౌత్‌పషియన్ టోర్నీకి ధ్రితి

హైదరాబాద్, ఆట ప్రతినిధి: నేపాల్ వేదికగా జరుగనున్న ఆసియా ట్రయథ్లాన్ కప్‌తో పాటు సౌత్ ఏషియన్ చాంపియ్‌షిప్ టోర్నీకి తెలంగాణ యువ అథ్లెట్ ధ్రితి కౌజాల్జి ఎంపికైంది. ఈనెల 27 నుంచి మొదలయ్యే టోర్నీల్లో భారత్ తరపున ధ్రితి బరిలోకి దిగనుంది. 2014లో స్విమ్మింగ్ కెరీర్ మొదలుపెట్టిన ధ్రితి..ఆ తర్వాత ట్రై అథ్లెట్(స్విమ్మింగ్, సైక్లింగ్, రన్నింగ్)గా మారి నిలకడగా రాణిస్తున్నది.

న్యూఢిల్లీలో సోమవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా పద్మశ్రీ అవార్డు అందుకుంటున్న టెన్నిస్ దిగ్గజం రోహన్ బోపన్న

పనికి టీసీఎస్ భేష్

దేశంలోనే అత్యుత్తమ సంస్థ: లింక్డ్‌ఇన్ • టాప్-25లో టెక్నాలజీ కంపెనీలే ముందు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 22: దేశంలో అత్యుత్తమ సంస్థల జాబితాను ప్రొఫెషనల్ నెట్‌వర్కింగ్ వేదిక లింక్డ్‌ఇన్ విడుదల చేసింది. టాప్-25 కంపెనీలతో విడుదలైన ఈ వార్షిక లిస్టులో భారతీయ ఐటీ రంగ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) మరోమారు సత్తా చాటింది. తన ఆధిపత్యాన్ని కొనసాగిస్తూ ఈసారీ అగ్రస్థానంలో నిలిచింది. పని చేయడానికి ఉద్యోగులకు అత్యంత అనువైన కంపెనీగా టీసీఎస్‌ను మించినది భారత్‌లో మరొకటి లేదని లింక్డ్‌ఇన్ తేల్చింది. విదేశీ ఐటీ కంపెనీలైన యాక్సెంచర్, కాగ్నిజెంట్ వరుసగా రెండు, మూడు స్థానాల్లో ఉన్నాయి. మొత్తానికి టెక్నాలజీ కంపెనీల హవా స్పష్టంగా కనిపించడం విశేషం.

ఈ ప్రాతిపదికన..

మొత్తం 8 కీలక అంశాల ప్రాతిపదికన ఈ జాబితాలోని కంపెనీలకు లింక్డ్‌ఇన్ ర్యాంకులు నిచ్చింది. కెరియర్ పెరుగుదల, నైపుణ్యాభివృద్ధి, సంస్థ స్థిరత్వం, బయటి అవకాశాలు, ఉద్యోగుల సంతృప్తి, వైవిధ్యం, విద్యార్హతలు, దేశవ్యాప్తంగా కంపెనీ కార్యకలాపాల అధారంగా అత్యుత్తమ సంస్థలను ఎంపిక చేశారు. ఇదిలావుంటే టాప్-15 మధ్యశ్రేణి కంపెనీల జాబితానూ లింక్డ్‌ఇన్ విడుదల చేసింది. సాఫ్ట్‌వేర్ యాజ్ ఏ సర్వీస్ (సాస్) వేదిక లెంత్రా మొదటి స్థానంలో ఉన్నది. మేక్‌మైట్రిప్, నైకా, డ్రీమ్11 సంస్థలూ ఈ లిస్టులో ఉన్నాయి. 'ఈసారి జాబితాలో చోటు సంపాదించిన సంస్థలు.. నేటి ప్రపంచంలో ఉద్యోగుల అనుభవం, నైపుణ్యానికి పెద్దపీట వేయడం కీలకమని రుజువు చేశాయి. కృత్రిమ మేధస్సు (ఏఐ)కు ప్రాధాన్యత పెరుగుతున్న నేపథ్యంలో కంపెనీలు కూడా తమ ఆలోచనా తీరును మార్చుకుంటున్నాయి. అందుకే ఈ పోటీ మార్కెట్‌లో ఉద్యోగులను ఆకట్టుకోవడంలో ఈ సంస్థలు ముందుంటున్నాయి' అని లింక్డ్‌ఇన్ అభిప్రాయపడింది.

లింక్డ్‌ఇన్ జాబితాలోని టాప్-25 సంస్థలు

• టీసీఎస్ • యాక్సెంచర్ • కాగ్నిజెంట్ • మాక్వెరీ గ్రూప్ • మోర్గాన్ స్టాన్లీ • డెలాయిట్ • ఎండ్రెస్‌ప్లస్ హోసర్ గ్రూప్ • బ్రిస్టల్ మైయర్స్ స్క్విబ్ • జేపీమోర్గాన్ చేజ్‌లండ్‌కో • పెప్సీకో • డీపీ వరల్డ్ • హెచ్‌సీఎల్ టెక్ • ఈవై • ష్నైడర్ ఎలక్ట్రిక్ • అమెజాన్ • కాంటినెంటల్ • మాస్టర్‌కార్డ్ • ఇంటెల్ కార్పొరేషన్ • ఐసీఐసీఐ బ్యాంక్ • మిషెలిన్ • ఫోర్టివ్ • వెల్స్ ఫార్గో • గోల్డ్‌మన్ సాచ్స్ • నోవో నోర్డిస్క్ • వియాట్రిస్

జోరుగా విమాన ప్రయాణాలు

దేశంలో రికార్డు స్థాయిలో రద్దీ • ఆదివారం 4.72 లక్షల ప్రయాణికులు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 22: దేశంలో విమాన ప్రయాణికుల రద్దీ సరికొత్త రికార్డుకు చేరింది. ఒక్కరోజే దాదాపు 5 లక్షల మంది ప్యాసింజర్లు నమోదయ్యారు. ఆదివారం దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల మధ్య నడిచిన 6,128 విమాన సర్వీసుల్లో ఏకంగా 4,71,751 మంది ప్రయాణించినట్టు తేలింది. ఈ మేరకు కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖ తాజాగా తెలియజేసింది. కరోనాకు ముందున్న రోజుల్లో ప్రయాణికుల సగటు (3,98,579)తో పోల్చితే ఇది 14 శాతం అధికమని స్పష్టం చేసింది. కాగా, నిరుడు ఏప్రిల్ 21న 5,899 విమాన సర్వీసుల్లో 4,28,389 మంది ప్రయాణించారు. 'భారతీయ విమానయాన రంగంలో మునుపెన్నడూలేని వృద్ధి నమోదవుతున్నది. ఆర్థికాభివృద్ధి, ప్రభుత్వ విధానాలు, అందుబాటు ధరల్లో విమాన సేవలందించే సంస్థల విస్తరణ ఇందుకు కలిసొస్తున్నది. పెరుగుతున్న విమాన ప్రయాణికులే దీనికి నిదర్శనం. రోజురోజుకూ సరికొత్త స్థాయికి ప్యాసింజర్ల సంఖ్య చేరుతున్నది. ముమ్ముందూ ఈ జోరు కొనసాగగలదని ఆశిస్తున్నాం' అని ఎక్స్‌లో విమానయాన మంత్రిత్వ శాఖ పోస్ట్ చేసింది. ఈ ఏడాది జనవరి-మార్చిలో దేశీయ విమానయాన సంస్థల సర్వీసుల్లో ప్రయాణించిన వారు 391.46 లక్షలుగా ఉన్నట్టు గత వారం భారతీయ విమానయాన నియంత్రిత సంస్థ డీజీసీఏ తెలిపింది. గత ఏడాది ఇదే వ్యవధిలో ప్యాసింజర్ల సంఖ్య 375.04 లక్షలుగా ఉన్నారు. దీంతో వార్షిక వృద్ధి 4.38 శాతంగా నమోదైందన్నది. నెలవారీ వృద్ధిరేటూ 3.68 శాతంగా ఉన్నట్టు డీజీసీఏ వెల్లడించింది.

రియల్ డౌన్

- తగ్గిన స్థిరాస్తి రిజిస్ట్రేషన్లు
- గ్రేటర్ పరిధిలో మందగమనం
- నైట్ ఫ్రాంక్ ఇండియా నివేదిక

హైదరాబాద్ సిటీబ్యూరో, ఏప్రిల్ 22 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ మార్కెట్ నేలచూపులు చూస్తున్నది. రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తర్వాత నిర్మాణ రంగంలో పెట్టుబడులు పెట్టేవారు వేచిచూసే ధోరణిలో పడ్డారు. గ్రేటర్ పరిధిలో జరిగిన స్థిరాస్తి రిజిస్ట్రేషన్లపై ప్రముఖ రియల్ ఎస్టేట్ మార్కెట్ అధ్యయన సంస్థ నైట్ ఫ్రాంక్ ఇండియా విడుదల చేసిన తాజా నివేదికే ఇందుకు అద్దం పడుతున్నది. గత ఏడాది మార్చిలో 6,959 రిజిస్ట్రేషన్లు జరిగితే, ఈ ఏడాది మార్చిలో 6,416 నమోదయ్యాయి. దీంతో 8 శాతం పడిపోయినట్టైంది. ఈ ఏడాది ఫిబ్రవరితో చూసినా 10 శాతం క్షీణత కనిపిస్తున్నది. ఇక గతంలో జరిగిన అగ్రిమెంట్లతో రిజిస్ట్రేషన్లకు రావడం వల్లే ఈ ఏడాది ఫిబ్రవరిలో రిజిస్ట్రేషన్లు పెరిగాయంటున్నారు. నిరుడు డిసెంబర్‌తో పోల్చితే ఈ జనవరిలోనూ రిజిస్ట్రేషన్లు 25 శాతం తగ్గడం గమనార్హం.

మధ్యతరగతి దూరం

సొంతింటి కలకు మధ్యతరగతి వర్గాలు దూరమైనట్టు తాజా గణాంకాల్లో స్పష్టమవుతున్నది. మొత్తం రిజిస్ట్రేషన్లలో నిరుడు మార్చితో చూస్తే.. ఈ ఏడాది మార్చిలో రూ. 25 లక్షలలోపు రిజిస్ట్రేషన్లు 18 శాతం నుంచి 14 శాతానికి దిగజారాయి. అలాగే రూ.25-50 లక్షలలోపు రిజిస్ట్రేషన్ల వాటా కూడా 53 శాతం నుంచి 45 శాతానికి పతనమైందని నైట్ ఫ్రాంక్ తమ రిపోర్టులో పేర్కొన్నది. ఇక 500-1,000 చదరపు అడుగుల్లోని నివాసాలకు డిమాండ్ గతంలో 17 శాతంగా ఉంటే, ఇప్పుడు 13 శాతంగానే ఉన్నది. ఈ పరిణామం మిడిల్ క్లాస్ కస్టమర్లు మార్కెట్‌కు దూరమయ్యారని చెప్పకనే చెప్తున్నది.

రికార్డుల నుంచి పసిడి వెనక్కి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 22: మునుపెన్నడూలేని విధంగా రికార్డు స్థాయిలో దూసుకుపోయిన బంగారం ధరలు తగ్గుముఖం పట్టాయి. ఇరాన్-ఇజ్రాయెల్ ఉద్రిక్తతలు తగ్గడంతో గ్లోబల్ మార్కెట్లో గోల్డ్ రేట్లు దిగాయి. దీంతో ఢిల్లీలో తులం బంగారం ధర రూ.450 తగ్గి రూ.73,650కి దిగింది. అంతకుముందు రూ.74,100గా ఉన్నది. వెండి రేటూ భారీగా తగ్గింది. కిలో రూ.1,100 తగ్గి రూ.86,600 నుంచి 85,500కి దిగొచ్చింది. హైదరాబాద్‌లో 22 క్యారెట్ తులం బంగారం ధర రూ.500 తగ్గి రూ. 68,050 నుంచి రూ.67,550కి చేరుకున్నది. 24 క్యారెట్ ధర రూ.550 తగ్గి రూ. 73,690కి తగ్గింది. కిలో వెండి రూ.1,000 తగ్గి రూ.89 వేలకు దిగింది.

వాణిజ్య

రూల్స్ ఉల్లంఘించిన అదానీ ఇన్వెస్టర్లు?

- గుర్తించిన మార్కెట్ రెగ్యులేటర్ సెబీ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 22: అదానీ గ్రూప్‌లో పెట్టుబడులు పెట్టిన పదికిపైగా విదేశీ మదుపరులు నిబంధనల్ని ఉల్లంఘించినట్టు మార్కెట్ రెగ్యులేటర్ సెబీ గుర్తించిందని సమాచారం. పరిమితికి మించి పెట్టుబడులు పెట్టడం, సమాచారం ఇవ్వకపోవడం వంటి పొరబాట్లు చేశారని తెలుస్తున్నది. ఈ మేరకు ఇద్దరు అధికారుల ద్వారా సోమవారం తెలిసింది. అయితే దీనిపై అటు సెబీగానీ, ఇటు అదానీ గ్రూప్‌గానీ స్పందించలేదు. కాగా, హిండెన్‌బర్గ్ రిపోర్టుతో ఇప్పటికే అదానీ వ్యవహారం దేశవ్యాప్తంగా తీవ్ర దుమారం రేపిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఇది ప్రాధాన్యతను సంతరించుకుంటున్నది. ఇదిలావుంటే సదరు ఇన్వెస్టర్లకు ఇప్పటికే సెబీ నోటీసులు జారీ చేసిందని కూడా అంటున్నారు. అదానీ గ్రూప్‌లో వారి పెట్టుబడుల గురించిన సమాచారం ఇవ్వాలని అందులో ఆదేశించింది. అలాగే నిబంధనల ఉల్లంఘనకు సంబంధించీ వివరణ కోరిందని చెప్తున్నారు. కాగా, ఈ వ్యవహారంలో ఎనిమిది మంది ఇన్వెస్టర్లు జరిమానా చెల్లించి తప్పించుకోవాలని చూస్తున్నట్టు సమాచారం. ఈ మేరకు సెబీకి ఓ విజ్ఞప్తి లేఖ కూడా రాశారని తెలుస్తున్నది.

నిరాశపరిచిన రిలయన్స్

క్యూ4లో రూ.18,951 కోట్ల లాభం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 22: దేశీయ వ్యాపార దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్ నిరాశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. గడిచిన ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలో సంస్థ రూ.18,951 కోట్ల నికర లాభం లేదా ప్రతిషేరుకు రూ.28.01 ఆర్జించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో వచ్చిన రూ.19,299 కోట్లు లేదా ప్రతిషేరుకు రూ.28.52 కంటే తక్కువగా నమోదైంది. కానీ, అక్టోబర్-డిసెంబర్ త్రైమాసికంలో నమోదైన రూ.17,265 కోట్ల కంటే అధికం కావడం విశేషం. చమురు అధిక ధరల కారణంగా గత త్రైమాసికంలో సంస్థ రూ.2.64 లక్షల కోట్ల ఆదాయాన్ని గడించింది. గతేడాది కంటే ఇది 11 శాతం అధికం. చమురు, పెట్రోకెమికల్స్ వ్యాపారాలు ఆశాజనక పనితీరు కనబరిచినప్పటికీ టెలికం, రిటైల్ రంగాలు సంస్థ లాభాలకు గండికొట్టాయి.

10 లక్షల కోట్ల ఆదాయం

రిలయన్స్ మరో చరిత్రను సృష్టించింది.

- *రిటైల్ బిజినెస్ నుంచి సంస్థ రూ.2,698 కోట్ల లాభాన్ని గడించింది.*
- *2023-24 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.10 డివిడెండ్‌ను ప్రకటించింది. ఇప్పటికే రూ.9 డివిడెండ్‌ను ఇచ్చింది.*
- *కేజీ బేసిన్ నుంచి రోజుకు 30 మిలియన్ స్టాండర్డ్ క్యూబిక్ మీటర్ల గ్యాస్, 23 వేల బ్యారెల్ల చమురును ఉత్పత్తి చేస్తున్నది.*
- *కంపెనీ రుణాలు రూ.3.11 లక్షల కోట్ల నుంచి రూ.3.24 లక్షల కోట్లకు పెరిగాయి. అలాగే నగదు నిల్వలు రూ.12.5 లక్షల కోట్ల నుంచి రూ.1.16 లక్షల కోట్లకు తగ్గాయి.*

2023-24 ఆర్థిక సంవత్సరం మొత్తానికి రూ.10 లక్షల కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. ఒక ఏడాదిలో ఇంతటి స్థాయిలో ఆదాయాన్ని ఆర్జించిన దేశీయ తొలి సంస్థ రిలయన్స్ కావడం విశేషం. అలాగే గతేడాదికిగాను రూ. 69,621 కోట్ల నికర లాభాన్ని గడించింది.

గత త్రైమాసికంలో అన్ని విభాగాలు పటిష్టమైన ఆర్థిక, నిర్వహణ పనితీరును నమోదు చేశాయి. పన్నులు చెల్లించక ముందు లక్ష కోట్ల లాభాన్ని ఆర్జించిన తొలి సంస్థ రిలయన్స్ కావడం విశేషం. డిజిటల్ రంగం బూస్ట్‌నిచ్చింది.

- ముకేశ్ అంబానీ, రిలయన్స్ ఇండస్ట్రీస్ సీఎండీ

జియో లాభం 5,337 కోట్లు

జియో లాభాల్లో దూసుకుపోతున్నది. గడిచిన త్రైమాసికానికిగాను సంస్థ రూ.5,337 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని గడించింది. అంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.4,716 కోట్ల లాభంతో పోలిస్తే 13 శాతం ఎగబాకింది. అలాగే సంస్థ ఆదాయం ఏడాది ప్రాతిపదికన 11 శాతం ఎగబాకి రూ. 25,959 కోట్లుగా నమోదైంది. 2023-24 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.1,00,119 కోట్ల ఆదాయంపై రూ.21,424 కోట్ల లాభాన్ని గడించింది. మరోవైపు, జియో మేనేజింగ్ డైరెక్టర్ సంజయ్ మల్రువాలా తన పదవికి రాజీనామా చేశారు. ధీరుభాయి అంబానీ కాలం నుంచి రిలయన్స్‌లో కీలక వ్యక్తిగా వ్యవహరించిన మల్రువాలా..జూన్ 9న వైదొలగనున్నారు. దీంతో పంకజ్ మోహన్ పవార్ ఎండీగా కొనసాగనున్నారు. జియో కస్టమర్ల 47 కోట్ల నుంచి 48 కోట్లకు పెరిగారు. ఒక్కో కస్టమర్‌పై సరాసరిగా రూ.181.7 ఆదాయాన్ని ఆర్జిస్తున్నది.

DHRUVA SPACE

ధృవ శాటిలైట్ తయారీ కేంద్రం

హైదరాబాద్, ఏప్రిల్ 22: టెక్నాలజీ స్టార్టప్ ధృవ.. హైదరాబాద్‌లో శాటిలైట్ ఇన్‌ఫ్రా తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయబోతున్నది. ఇందుకు అవసరమైన నిధులను అంతర్జాతీయ పెట్టుబడిదారుల నుంచి సేకరించింది. 2.8 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి సమీపంలో ఏర్పాటు చేస్తున్న ఈ యూనిట్‌లో స్పేస్‌క్రాఫ్ట్ సోలార్ అరేస్, శాటిఐల్ సబ్‌సిస్టమ్స్, వెహికల్ సపరేషన్ సిస్టమ్స్, అసెంబ్లీ ఇంటిగ్రేషన్ ఉత్పత్తి చేస్తున్నట్లు కంపెనీ సీఈవో సంజయ్ నెక్కంటీ తెలిపారు. సిరీస్ బీ ఫండింగ్‌లో భాగంగా ఇండియన్ ఏంజిల్ నెట్‌వర్క్ ఆల్ఫా ఫండ్, బ్లూ అశ్వ క్యాపిటల్ నుంచి 9.3 మిలియన్ డాలర్లు(రూ.78 కోట్లు) సమీకరించింది. సిరీస్ ఏ లో భాగంగా 14 మిలియన్ డాలర్లు లేదా రూ.123 క